క్లుప్తంగా

డివిజన్ స్థాయి స్పందనకు 12 అర్జీలు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రతి వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందనలో భాగంగా సోమవారం ఆయా మండలాల నుంచి 12 అర్జీలు అందినట్లు ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. పట్టణ పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న నల్ల బూడిద నివారణపై చర్యలు చేపట్టాలని, ఆక్రమణకు గురైన భూమిని ఇప్పించాలని, భూ రీ సర్వే చేయాలని తదితర సమస్యలపై 12 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు పంపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీఎల్‌పీఓ బాలామణి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, సీడీపీఓ ఉష ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

3న కాపు వన సమారాధన

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో వచ్చేనెల 3న కాపు వన సమారాధన నిర్వహిస్తున్నట్టు కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, చల్లపల్లి వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. కాపు, బలిజ, ఒంటరిలు ఈ సమారాధనలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

రేపు పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సాధారణ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన ఉంటుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

'క్రియ'లో భాష్యం విద్యార్థుల ప్రతిభ


బుర్రకథలో బహుమతులు పొందిన విద్యార్థులు

సామర్లకోట: కాకినాడ జేఎన్‌టీయూకేలో ఆదివారం నిర్వహించిన క్రియ పిల్లల పండగ పోటీల్లో స్థానిక భాష్యం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుచుకున్నారు. తమ విద్యార్థులు బుర్రకథ ప్రదర్శించి బహుమతులు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్స్ ఎం.సూర్యారావు, బి.శిరీష తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న ఎం.శ్రీలేఖ, డి.తేజస్విని, జి. వర్ధిని బుర్ర కథలో అలరించి ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు. విద్యార్థులను ఆ విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జి గోవింద రాజులు అభినందించారు.

అల్లక్కి సత్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఈఓ జగన్మోహన శ్రీనివాస్

పెద్దాపురం: స్థానిక రామారావు పేట అల్లక్కి వారి సత్రం సేవలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ అన్నారు. సత్రం వ్యవస్థాపకుడు అల్లక్కి వెంట్రామయ్య జయంతి సందర్భంగా సోమవారం సత్రం వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు అల్లక్కి శాస్త్రి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, కిరాణ సరుకులు ఆయన చేతుల మీదుగా అందజేశారు. జగన్మోహన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సత్రం ఎంతో మంది పేదలకు అండగా ఉండాలని వెంకట్రామయ్య స్థాపించిన సత్రం ద్వారా నిత్యం పేదలకు అన్నదానం జరుగుతోందన్నారు. అనంతరం సుమారు 300 మందికి దుప్పట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వి.కృష్ణార్జునరావు, ఆర్.ఎస్.దుర్గాప్రసాద్, వై.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

పిఠాపురం: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణ శాఖ సీఈ జీవీ ప్రసాద్ సిబ్బందికి సూచించారు. ఆయన సోమవారం గొల్లప్రోలు జగనన్న కాలనీలో పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కాలనీలో బోర్లు పనిచేయక, తాగునీరందక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే బోర్లు మరమ్మతులు చేయించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. రహదారి నిర్మాణంలో భాగంగా కొండ కాలువపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

యమపాశాలు

- ఇళ్లపై వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు
- కొండెవరంలో పొంచిఉన్న ముప్పు
- వర్షం పడితే రాజుకుంటున్న మంటలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


మూడేళ్ల క్రితం విద్యుత్ తీగల వల్ల మృతి చెందిన బాలుడు (ఫైల్)


కొండెవరం ఇందిరా కాలనీలో అపాయకరంగా ఉన్న విద్యుత్ తీగలు

కొత్తపల్లి: విద్యుత్ తీగలు వేలాడే యమపాశాలుగా పరిణమించాయి. అధికారుల నిర్లిప్త ధోరణితో ప్రజల ప్రాణాలకు భద్రత కొరవడింది. కొండెవరం ఇందిరా కాలనీలో ఇంటి పిట్టగోడకు ఆనుకుని ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో మూడేళ్ల క్రితం విద్యార్థి సతీష్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి నుంచి ఏ సమయంలో, ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రధాన రహదారులు, కూడళ్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీజు కటౌట్లకు ఎటువంటి రక్షణ కవచాలను ఏర్పాటు చేయలేదు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మార్కెట్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు అపాయాన్ని చెప్పకనే చెబుతున్నాయి. వర్షాకాల సమయంలో ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ తీగల నుంచి మంటలు వస్తుండడంతో స్థానికులు అనుక్షణం భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా స్పందించలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ తీగలు మార్చాలని ఇందిరాకాలనీ ప్రజలు కోరుతున్నారు.

తీర ప్రాంత గ్రామాల్లో..

మండలంలోని తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ, అమీనాబాద్, మూలపేట, కోనపాపపేటతో పాటు అనేక గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లకు ఎటువంటి రక్షణ లేదు. పలుచోట్ల మూడు అడుగుల ఎత్తు కూడా లేకపోవడంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా మండలంలో రెండు గేదెలు మృతి చెందడంతో పాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాం



ఇళ్లపైనే 11 కేవీ విద్యుత్ తీగలు ఉండడం వల్ల ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాం. వర్షాలు, తుఫాను సమయాల్లో విద్యుత్ తీగల నుంచి పెద్ద మంటలు వ్యాపిస్తున్నాయి. తీగల కింద ఉన్న వారంతా బయటకు పరుగులు పెట్టే పరిస్థితి ఏర్పడుతుంది.

– జె.పోలరత్నం, గృహిణి, కొండెవరం ఇందిరాకాలనీ

ఇప్పటికైనా తీగలను మార్చాలి



కొండెవరం ఇందిరాకాలనీలో ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను ఇప్పటికైనా అధికారులు మార్చాలి. ఎన్నిసార్లు పంచాయతీ, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నాం. ప్రజల ప్రాణాలపై నిర్లక్ష్యం తగదు.

– బి.నూకరత్నం, కొండెవరం ఇందిరాకాలనీ, గృహిణి

తీగలు మార్చేందుకు అంచనాలు వేశాం

కొండెవరంలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, మండలంలోని ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలను ఏర్పాటు చేసేందుకు అంచనాలు వేసి, ఉన్నత స్థాయి అధికారులకు అందజేశాం. ముఖ్యంగా ప్రధాన రహదారులు, తీర ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ తీగలను ప్రమాదం జరగని ఎత్తులో ఉంచుతాం. కొండెవరంలో తీగలను మార్చేందుకు అంచనా వేసి, పంచాయతీకి పంపించాం. పంచాయతీ నుంచి నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– ప్రమోద్, విద్యుత్ ఏఈ, కొత్తపల్లి

పాదగయను దర్శించిన ప్రముఖులు


పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్టీఐ కమిషనర్ ఐలాపురం రాజా దంపతులు


పాదగయ క్షేత్రంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఆర్టీఐ కమిషనర్ ఐలాపురం రాజా తదితరులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారు కుక్కుటేశ్వరస్వామిని రాజరాజేశ్వరీదేవిని, పురూహూతికా అమ్మవారిని, దత్తాత్రేయుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వి శ్రీనివాసరావు, ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు వారికి ప్రసాదాలు అందజేశారు. వారి వెంట సీఐ శ్రీనివాస్, తహసీల్దారు త్రినాథరావు ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో భాగస్వాములు కావాలి

- రాష్ట్ర స్థాయి గుర్తింపు తీసుకురావాలి
- మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిప్రసాద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న సాయి ప్రసాద్

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 15వ తేదీ నుంచి చేపట్టే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పట్టణ యువత భాగస్వాములు కావాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా సామగ్రిని ఆయన ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వారీగా క్రీడా పోటీలును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పట్టణ యువత క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయిలో పెద్దాపురానికి గుర్తింపు తీసుకురావాలని సాయి ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రో డెరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్ళ వీర్రాఘవులు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, గుర్రాల యాకోబు తదితరులు పాల్గొనారు.

క్రిస్టియన్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి చర్యలు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం మండలం విరవాడ బైబిల్ మిషన్ చర్చిలో సోమవారం పిఠాపురం మండలం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా మైనారిటీస్ ప్రెసిడెంట్ దడాల జాషువా, పిఠాపురం మండలం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జి ప్రకాష్, సోంబాబు, ఎం జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన తప్పనిసరి


వాకతిప్పలో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీఓ వెంకట నారాయణ అన్నారు. వాకతిప్పలోని రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం విక్షిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని సర్పంచ్ పాలాని దొరబాబు అధ్యక్షతన నిర్వహించారు. పలువురికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా 17 సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఎంఈఓ వేణుగోపాల్, వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు, ఈఓపీఆర్డీ భాస్కర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.


ఉసిరి చెట్టు వద్ద దీపాలు పెట్టి పూజలు చేస్తున్న భక్తులు


సామర్లకోటలో జరిగిన కార్తిక వన సమారాధనలో పాల్గొన్న మహిళలు


కొత్తపల్లిలో బాలా త్రిపుర సుందరీ సమేత రాజశేఖర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అటు పంచాక్షర జపం.. ఇటు పౌర్ణమి పూజలు


పంచారామ క్షేత్రంలో గోపూజ చేస్తున్న భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర ఆలయంలో సోమవారం కార్తిక పౌర్ణమి, కృత్తికా నక్షత్ర పూజలు నిర్వహించారు. దీంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి శివ పంచాక్షరి నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని ప్రతిధ్వనింపజేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించారు. దాంతో ఆలయంలోని ధ్వజ స్తంభం, జమ్మి చెట్టు, తులసి కోట, మారేడు చెట్టుతో పాటు ఆలయం అంతా దీపాలతో నిండి పోయింది. తెల్లవారు జామున మూడు గంటలకు గోపూజ చేసి పూజలను ప్రారంభించారు. స్వామికి అభిషేకాలు, తొలిపూజలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజా పేరున తొలి పూజను నిర్వహించారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి అల్లు వెంకట దుర్గాభవాని, ఈఓ. డి. నాగమల్లేశ్వర రావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజలు చేయగా దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్త కమిటీ సభ్యులు అన్నదానంలో భక్తులకు సేవలందించారు. సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఆర్టీఐ కమిషనర్ పూజలు

ఆలయంలో ఆర్టీఐ కమిషనర్ ఇల్లాపురం రాజా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా పిఠాపురం నుంచి సామర్లకోట ఆలయానికి వచ్చిన కమిషనర్ దంపతులకు ఆలయ పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మూలవిరాట్, ఉప ఆలయాలు, స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అలాగే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వామిని దర్శించుకున్నారు. వారికి పండితులు ఆశీర్వచనాలు అందజేశారు

ఉత్సాహంగా వన సమారాధనలు

కార్తిక మాసంలో వన సమారాధనలు జోరందుకున్నాయి. సోమవారం స్థానిక పంచారామ క్షేత్రం సమీపంలోను, మాండవ్యనారాయణస్వామి ఆలయం వద్ద, రామలింగేశ్వర ఆలయం వద్ద, పాండురంగ ఆలయం, సుధా ఫ్యాక్టరీ సమీపంలోను వన సమారాధనలు జోరుగా జరిగాయి. రావి, ఉసిరి చెట్లకు పూజలు చేసి బంధు మిత్రులతో సహపంక్తి భోజనాలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గోకేడా రాజా సుధా ఫ్యాక్టరీ సమీపంలో ఏర్పాటు చేసిన వన సమారాధనలో దవులూరి చారిట బుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుడు కరణం భానునాయుడు, నక్కా శ్రీనివాసరావు, కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

కొత్తపల్లి: రెండో కార్తిక సోమవారం కావడంతో మండలంలోని అన్ని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న బాలా త్రిపుర సుందరీ సమేత రాజశేఖర స్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, ధర్మశాస్తా, ఉప్పాడలో ఉన్న చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, బలభద్ర సమేత మల్లేశ్వరస్వామి, మత్స్య లింగేశ్వర స్వామి ఆలయాలతో పాటు మూలపేట, గోర్స తదితర గ్రామాల్లో ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి, ఎండపల్లిలో ఉన్న మాణిక్యాంబ సమేత కరకంఠేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు రావిచెట్టు, ధ్వజ స్తంభాల వద్ద ఆవు నెయ్యితో దీపాలను వెలిగించి, పూజలు చేశారు. కొత్తపల్లిలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మహిళలు విష్ణుపారాయణం చేశారు.

కిటకిటలాడిన శివాలయాలు

పెద్దాపురం: కార్తీక మాసంలో రెండో సోమవారం కావడంతో పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఆయా నదీ ప్రవాహాల్లో దీపాలు వదలి సోమవార వ్రతాన్ని ఆచరించారు. పట్టణంలోని విశ్వేశ్వర, చంద్రశేఖరస్వామి వార్ల ఆలయంలో ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్, ఆలయ అర్చకులు విప్పర్తి కృష్ణతేజ వర్మల ఆధ్వర్యంలో కార్తిక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలాగే చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, గోరింట గ్రామాల్లో కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. గుడివాడ, గోరింట, దివిలి, తిరుపతి, చదలాడ, వడ్లమూరు, పిఠాపురం మండలం విరవ, మల్లాం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వన సమారాధనలో భాగస్వాములయ్యారు.

శివోహం..!

పిఠాపురం: కార్తిక సోమవారం సందర్భంగా స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయం చేరుకుని ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురూహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. పట్టణంలో సోమేశ్వరస్వామి, సకలేశ్వరస్వామి తదితర ఆలయాల్లోను అధికారులు ప్రత్యేక పూజలకు ఏర్పాటు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పిఠాపురం మండలం భోగాపురం, పి.దొంతమూరు, చిత్రాడ, విరవాడ, మల్లాం, రాయవరం, గొల్లప్రోలు మండలం దుర్గాడ రామలింగేశ్వరస్వామి, తాటిపర్తి అపర్ణాదేవి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. వివిధ రకాల ఫలాలను స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించారు.


పాదగయలో కుక్కుటేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న పురోహితులు


దేదీప్యమానంగా కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న పాదగయ క్షేత్రం

సంస్కృతీ సంప్రదాయాలకు నెలవు


విరవలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: మన సంస్కృతి సంప్రదాయాలకు నెలవు కార్తిక వన సమారాధనలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన సోమవారం పిఠాపురం మండలం విరవలో జరిగిన కార్తిక వన సమారాధనకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉన్న రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో కార్తికమాస సప్తాహ కార్యక్రమంలో పాల్గొని, భజన నిర్వహించారు. తొలుత స్వామి వారిని దర్శించుకోగా, ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేయండి


రెడ్‌క్రాస్ డివిజన్ కమిటీతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేయాలని ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. డివిజన్ స్థాయి నూతన రెడ్ క్రాస్ కమిటీని సోమవారం ఆయన ఛాంబర్‌లో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ రెడ్ క్రాస్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వైడీ రామారావు, సెక్రటరీ కె.శివకుమార్‌ల ఆధ్వర్యంలో నూతన డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ డివిజన్ శాఖ చైర్మన్‌గా సీహెచ్ విజయ్‌ప్రకాష్, వైస్ చైర్మన్‌గా డీవీఎస్ రాజు, సెక్రటరీగా పాలచర్ల సీతాదేవి, కోశాధికారిగా రావు ప్రభాకరరావు ఎన్నుకున్నారు. అనంతరం ఆర్డీఓ, జిల్లా చైర్మన్‌లు వారిచే ప్రతిజ్ఞ చేయించారు.

అలరించిన జ్యోతిర్లింగార్చన



సామర్లకోట: పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన ఎంతో అలరించింది. ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్న వారు దీపాలంకరణ చేసేలా ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చనకు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు ఆ దీపాలు వెలిగించారు. ఆలయంలోని ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపాన్ని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తదుపరి ఆలయంలో జ్యోతిర్లింగార్చనలో దీపాలు వెలిగించారు.

ఘనంగా జ్వాలాతోరణం


కొత్తపల్లిలో జ్వాలా తోరణం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కార్తిక పౌర్ణమి సందర్భంగా బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి ఘనంగా జ్వాలాతోరణం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆలయ అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం జరిపించారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కనులపండువగా కృత్తికా దీపోత్సవం

పిఠాపురం: గొల్లప్రోలు సీతారామస్వామి వారి ఆలయంలో సోమవారం రాత్రి కృత్తికా దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు దీపోత్సవంలో పాల్గొన్నారు. వివిధ ఆకారాల్లో దీపాలు వెలిగించి, స్వామిని దర్శించుకున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

పెద్దాపురం: స్థానిక శోభా థియేటర్ సమీపంలో సోమవారం ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపకాధికారి శ్రీహరి జగన్నాథ్ తెలపిన వివరాలిలా ఉన్నాయి. థియేటర్ సమీపంలో నివాసముంటున్న ఐతి విల్సన్ రాయ్ (చింటు) గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు ఎగసి పడడంతో గృహోపకరణాలు, దుస్తులు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2.6 లక్షల మేర ఆస్తినష్టం సంభవించి ఉంటుందని ఆయన తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు మంటలను అదుపుచేశారు.